# పలుకే బంగారమాయెనా!?

**–శారదా అశోకవర్ధన్**

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ పన్నెండు...

ఆ చౌరస్తాలో రెడ్ సిగ్నెల్ పడింది!

దానికంటే ముందు ఆరెంజ్ రంగు సిగ్నెల్ పడింది. ఆరెంజ్ నుంచి రెడ్ పడేలోపు ఆ సెంటర్ దాటిపోవాలని కొంతమంది తమ వాహనాలను వేగంగా ముందుకు దూకించారు. వాటిల్లో ద్విచక్ర.. త్రిచక్ర (ఆటోలు) వాహనాలతో పాటు చిన్నవి.. పెద్దవి కారులు బోల్డున్నాయి. సెకెండ్ల వ్యవధిలోనే కొన్ని వాహనాలు ఆ సిగ్నెల్ గండం నుంచి తప్పించుకున్నాయి. (ఇక్కడ గండం అని ఎందుకు అనాల్సి వచ్చిందంటే సదరు వాహన చోదకుల దృష్టిలో... భాషలో అది గండమే) అలా ముందుకు దూసుకు వెళ్లలేని వాహనాల్లో ఓ పెద్ద పడవలాంటి వైట్ కారు కూడా వుంది. దాని పేరు హ్యుండాయ్ యాక్సెంట్... సిగ్నెల్ దాటలేక పోయాననే అనే బాధ వల్ల అతనిలో అసహనం పెరిగిపోయింది. దానికి చిహ్నంగా...

"ఓ డామిట్" అని పైకే అనేసి స్టీరింగ్‌పై సుతిమెత్తగా కుడి చేత్తో కొట్టాడు.. అంతకంటే బలంగా కొట్టలేక పోవటం అతని బలహీనత! ఎంచేతంటే ఆ కారంటే అతనికి ప్రాణం. ఆ మాటకొస్తే కారేకాదు.. ఇంకా చాలా అంటే అతనికి ప్రాణమే! వాటిల్లో 'టైం' ఒకటి! కాలాన్ని అతను అమితంగా ప్రేమిస్తాడు. భార్య కంటే ఎక్కువగా ప్రేమిస్తాడు. అంతేకాదు.. కాలం కూడా ఆతన్ని ప్రేమిస్తోంది. 'టైం' బాగుండబట్టే అతను బాగా సంపాదించగలుగుతున్నాడు.

"టైం ఈజ్ మనీ..!" అనే సూత్రాన్ని కనిపెట్టిన వాడెవడో గానీ ఆ సూత్రాన్ని తు.చ. తప్పక పాటిస్తాడతడు. అసలు ఆయన దృష్టిలో అది 'ఆర్కిమెడిస్' సూత్రం కంటే గొప్పదని అతని విశ్వాసం. 'టైం ఈజ్ మనీ' అనే సూత్రాన్ని కనిపెట్టినతను ఎవరో తెలిస్తే సొంత ఖర్చులతో సన్మానం చేయాలని అతను చాలా సార్లు అనుకున్నాడు. ఈ నేపథ్యంలో అతను ట్రాఫిక్ సిగ్నెల్ వద్ద చాలా చిరాకు పడుతూ వెయిట్ చేస్తున్నాడు. ఆ కొద్ది సెకండ్ల వ్యవధిలోనే అతను మూడు సార్లు వాచీ చూసుకున్నాడు. అతన్తో పాటు అక్కడ ఆగిన చాలామంది కూడా అలాగే చిరాకు పడుతున్నారో లేదో తెలియదు గానీ ఇతను మాత్రం గొప్పగా చిరాకు పడుతున్నాడు. ఇలాంటి వ్యక్తుల సౌలభ్యం కోసమే కాబోలు – పాపం ట్రాఫిక్ పోలీసులు సిగ్నెల్స్ దగ్గర ఈ మధ్య 'టైమర్సి' అమర్చారు! (టైం సెన్స్ వున్న వాళ్ల కోసమేమో!?)

ఇంతకీ ఆ వ్యక్తి అలా చిరాకు పడటానికి బలమైన కారణం వుంది. అతను నిమిషాన్ని సెకండ్లుగా విభజించి ఆ సెకెండ్‌ను ఒక్కో ప్రదేశంలో ఒక్కో రేటుగా ఫిక్స్ చేసి దాన్ని క్యాష్‌గా మార్చుకోవటంలో అతనిది అందెవేసిన చేయి! అతను ఎదుటి వారి చేయి పట్టుకుంటే చాలు వేలకు వేలు సమర్పించుకోవాల్సిందే. కత్తి పట్టుకుంటే లక్షలే (ఆపరేషన్ కన్నమాట!) అందుకే అతనిలో క్షణక్షణానికి చిరాకు పెరిగిపోతా వుంది. అతను అర్జెంట్‌గా హాస్పిటల్‌కు వెళ్ళాలి అంటే అతనికేదో గుండెజబ్బో.. నరాల బలహీనతో వుందనుకుంటే పొరపాటే. ఆ మాటకొస్తే ఆయన పేషెంటే కాదు. ఆయన బలహీనతలు రెండే.. డబ్బు... డబ్బు!!!

పేషెంట్ల దగ్గర నుంచి సమయానుకూలంగా – స్థలయానుకూలంగా డబ్బులు గుంజే వ్యక్తి!

అవును.. అతను ఓ డాక్టర్!! డబ్బు జబ్బున్న డాక్టర్!!

గ్రీన్ సిగ్నెల్ పడటంతో బతుకు జీవుడా అన్నట్లు కారును లెఫ్ట్‌కు తిప్పాడు. అంటే అతను బంజారాహిల్స్ నుంచి వస్తున్నాడు. అతను ఇంటి నుంచి వస్తున్నాడు. ఆ ప్రాంతంలో సొంత ఇల్లుందంటే సదరు డాక్టర్ గారు గొప్ప వ్యక్తి కిందే లెక్క (ఇది నా ఉద్దేశం కాదు బంజారాహిల్స్‌లో వున్న వాళ్ళంతా గొప్పోళ్ళని ప్రజాభిప్రాయం) అక్కడ ఇల్లుండటం చేతనేకాదు... వృత్తిపరంగా... టైం సెన్స్ పరంగా.. అస్సలు మాట్లాడకపోవటం పరంగా... ఓపిక పరంగా (ఓపికంటే సంపాదన విషయంలోనే) ఇంకా చాలా చాలా విషయాల పరంగా అతను గొప్ప వ్యక్తే!

ఆయన ఆ హాస్పిటల్ నుంచి మరో గంటలో ఇంకో కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళ్ళాలి... అక్కడ నుంచి మరోటి... ఇలా ఆయన సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు మూడు కార్పొరేట్ హాస్పిటల్స్‌ను గంటల వారీగా విజిట్ చేయాలి. అంటే పగలంతా ఖాళీగా వుంటాడనుకుంటే మీరు పప్పులో

కాలేసినట్లే!

ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు అతనో హాస్పిటల్లో 'బద్ధకం'గా ఉద్యోగం చేస్తాడు. అది జీతం కోసం! సాయంత్రాలు మాత్రం ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తుంటాడు. అంటే రోజుకు దాదాపు పన్నెండు గంటలు డ్యూటీ చేస్తాడు. ఈ పన్నెండు గంటల్లో సాయంత్రాలు పనిచేసే ఈ మూడు గంటలే అతనికి చాలా విలువైనవి! బద్ధకం ఇసుమంత కూడా వుండదు.. రెచ్చిపోయి పనిచేస్తాడు. ఆ గంటల్ని నిమిషాల్లోకి.. నిమిషాల్ని సెకెండ్లలోకి విభజించి వాటిని కరెన్సీగా మార్చుకోవటంలో ఆయన దిట్ట! ఆయన గూర్చి ఇంత చెప్పి పేరు చెప్పకపోతే బావుండదు కదా!? ఆయన పేరు..

డాక్టర్ గోపాలకృష్ణ ఎమ్.ఎస్. (దీని పక్కన ఎ టు జెడ్ వరకు ఆడిషనల్ క్వాలిఫికేషన్స్ బోల్డున్నాయి)

ఆ గోపాలుడు గోపికల్తో బిజీగా వుంటే.. ఈ డాక్టర్ కృష్ణ మాత్రం పేషెంట్లతో బిజీగా వుంటాడు. అతని ముందు క్షణానికో పేషెంట్ మారిపోతుంటాడు. సిటీలో పేరుమోసిన కార్డియాలజిస్ట్... డాక్టర్‌గారు నవ్వుతుండగా చూడాలని ఆశపడి పాపం చాలామంది భంగపడ్డారు. నవ్వేకాదు మాట్లాడుతుండగా చూడాలని.. వినాలని కూడా అనుకుని నిరాశ పడిన వారు కూడా బోల్డు మంది వున్నారు. అయితే వృత్తిరీత్యా మాత్రం ఆయన నెంబర్ వన్నే!

అందుకే ఆయన మిత్రులతో పాటు శతృవులు కూడా డాక్టర్ గార్ని 'గుండెలు తీసిన బంటు!' అని ముద్దుగా పిల్చుకుంటారు.

ఛాతీని కత్తితో క్షణాల్లో పరపరా కోసేయగలడు.. గుండెను తీసి గుండెను పెట్టగలడు.. ఆయన హస్తవాసి అలాంటిది మరి. (ఆ మధ్య కళ్ళకు గంతలు కట్టుకొని ఆపరేషన్ చేయాలనే తలంపు కూడా వచ్చి బావుండదేమో.. అని ఆ ఆలోచన్ని మానకున్నాడు) అందుకే ఆయన కోసం పేషెంట్లు బారులు తీరి కూర్చుంటారు! ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన నెంబర్ వన్ హైటెక్ డాక్టర్. చాలానే సంపాదించాడని భోగట్టా!

ఆ(యన)లో గుట్టు ఆయనకే ఎరుక..!

ఇంట్లో వాళ్ళకు కూడా తెలీదు పాపం. అంత గుట్టు మనిషి.. అంత గొప్ప మనీషి!!

○○○

"ఈ మధ్య ఎందుకో చాలా నీరసంగా వుంటోంది డాక్టర్.. మెట్లు ఎక్కలేక పోతున్నాను.. చెమటలు పట్టేస్తున్నాయి..." అంటూ పాపం ఓ ఆడ పేషెంట్ చెపుతూనే వుంది.. డాక్టర్ గోపాలకృష్ణ వింటున్నాడో లేదో అని అర్థం అయ్యేలోపే... ప్రిస్క్రిప్షన్ ఆవిడకిచ్చి..

"ఇవి వాడండి.." అన్నాడు.

"ఇవి వాడితే తగ్గిపోతుందా?!" అందావిడ నీరసంగా.

అవును అన్నట్లు తలూపి... ఇక మీరెళ్ళొచ్చు అన్నట్లు తలతోనే మరో సైగ చేశాడు.

ఆమె వెళ్ళిన వెంటనే మరో అతను డాక్టర్ గారి ముందు ప్రత్యక్షమయ్యాడు..

"మీరు రాసిన మందులు వాడాను డాక్టర్‌గారూ.. చాలా బాగా పనిచేశాయి.. కాకపోతే నీరసంగా వుంటోంది" అన్నాడు.

అతను చెప్పిన మాటల్ని క్షణంలో వెయ్యోవంతు ఆలకిస్తున్నట్లు ఆ వ్యక్తి ముఖాన్ని చూసి.. మరుక్షణం మందులు రాసి అతనికిచ్చాడు.

"ఇవి వాడితే నీరసం తగ్గిపోతుందంటారా!?" ఆశగా అడిగాడు... డాక్టర్ గారు 'తగ్గిపోతుంది. ఏం పర్వాలేదు' అనే రెండు మాటలు చెపితే ధైర్యం వస్తుందని ఆయన అనుకుంటున్నాడు పాపం – కాని డాక్టర్ గారు మాత్రం అవును అన్నట్లు తలూపాడు.. తన సహజ ధోరణిలో.

"పత్యం ఏమీ అక్కర్లేదా?!" అన్నాడు మళ్ళీ పేషెంట్.

"అక్కర్లేదు" అన్నట్లు తలూపాడు డాక్టర్ గారు అసహనంగా.

"అసలు నీరసం ఎందుకొస్తుందండీ!?" అన్నాడు మళ్ళీ..

"అబ్బబ్బ.. ఆ మందులు వాడవయ్యా పోతుంది.. టైం వేస్ట్ చేయకు" అన్నాడు చిరాగ్గా వాచీ చూసుకుంటూ.

పేషెంట్ బిక్కమొహం వేసుకుని వెళ్ళిపోయాడు.

అప్పటికే దాదాపు ముప్ఫయి మంది పేషెంట్లను చూశాడు.. హడావుడిగా చైర్లో నుంచి లేచి గ్లాస్ డోర్ తెరిచి కౌంటర్ దగ్గరకు వెళ్ళి క్యాష్ తీసుకుని వడివడిగా అడుగులు వేస్తూ కారు దగ్గరకు వెళ్ళాడు.. మరో హాస్పిటల్ విజిట్ చేయటానికి డాక్టర్ గారు.

○○○

అలా బతికిన డాక్టర్‌గారు తానే పేషెంట్‌గా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యేంత వరకు ఒక పేషెంట్ ఎలా ఫీలవుతాడో ఊహించుకోలేకపోయాడు. కుటుంబ

సభ్యులంతా కంగారు పడిపోయి ఆయనకు గొప్ప స్థాయిలో వైద్యం చేయించారు.. ఇంట్లోనే తన గదిలో డాక్టర్ గారు నీరసంగా పడుకుని వున్నారు. అయినా ఏదో వెలితి.. ఫుల్‌టైం నర్స్ ఆయన్ని అటెండ్ అవుతోంది. ఓ స్పెషలిస్ట్ డాక్టర్ ఆయన్ని ఉదయం సాయంత్రాలు వచ్చి సీరియస్‌గా విజిట్ చేసి వెళ్లిపోతున్నాడు. (ఆ డాక్టర్ కూడా ఈయనలాంటి వ్యక్తే ఒక్క మాట మాట్లాడడు) ఆయన డాక్టర్ గారిలో ఏదో తెలియని వెలితి.. భయం.. దిగులు.. గుబులు ఆవరించి వుంది. ఎందుకో తెలియటం లేదు.

"ఏమండీ నేను అలా బయటకు వెళ్లొస్తాను.. అమ్మాయి రేపు వెళ్లిపోతోంది కదా.. షాపింగ్ చేయాలి" అంటూ డాక్టర్‌గారి భార్య వసంతలక్ష్మి ఆయన బెడ్ దగ్గరకొచ్చి చెప్పింది.

"అలాగా, ఎంతసేపటిలో వస్తావు?!" అన్నాడు నీరసంగా.

షాపింగ్ అంటే టైం ఎలా చెప్పగలం చెప్పండి? అయినా నాతో పనేముంది మీకు? టైంకు మీకు నర్స్ అన్నీ అందిస్తోంది. జాగ్రత్తగా పడుకోండి. నేను వెళ్ళొస్తాను.. మరి.. నా కారు సర్వీసింగ్‌కు ఇచ్చాను.

---

# గుప్పెడు నానీలు

–పెరుగు రామకృష్ణ

అమెరికాలో
డాలర్ తెలిపిన విలువ
అమ్మ చేతుల్తో
తిన్న గోరుముద్దలు

పిడికిలి, సుత్తి
కొడవలి. నక్షత్రం
ఉద్యమ సముద్రాలకి
ఒకటే తీరం

రావి చెట్టు మీద
రామ చిలుకలు
దేశంలో
రోటీ, కపడా ఔర్ మకాన్

ఓటు లేకున్నా
వేలిపై చుక్క
నోటుకున్న
కొనుగోలు పవర్

నవ్వుతున్న ముఖం
ఆరిపోయింది
అప్రకటిత
కరెంటు కోత

వార్తల్నిండా
నెత్తుటి గాయాలు
మైకుల కోలాహలం
ఎక్కడో... ఎన్నికలు...

యుద్ధం
మండే సూర్యుడు
శాంతి
పున్నమి వెన్నెల

కాన్వెంట్ సరస్సులో
హంసల సంత
డబ్బీలో దేనికిరా
అగ్గిపుల్లలు కూరుతావ్...?

పైకి పిడికెడు
మాంసం ముద్దే
గిల్లితే లోలోపల
నిప్పుకొండ

కవిత్వంతో
పరాచికాలా...?
ప్రతి అక్షరం
ఓ కరెంటు తీగ...!

అప్పుడప్పుడు పలకరించే
బాల్య స్నేహితులు
ఆటోగ్రాపుల్లో
సంతకాలు

రాత్రి ప్రయాణం
స్వప్నాల్ని
మోసుకెళ్తూ
రైలు...

మీ కారు తీసుకెళ్తాను" అంటూ వసంతలక్ష్మి బయట కెళ్లిపోయింది. డాక్టర్‌గారు ఏదో అనబోయి ఆమె వెళ్ళిపోవటంతో నీరసంగా కళ్లు మూసుకున్నారు.

ఇంతలో.. "హాయ్ అంకుల్" అంటూ డాక్టర్ గారి కుమారుడి ఫ్రెండ్ వచ్చాడు.. అదే సమయంలో..

"తాతయ్యా.." అంటూ మనవడు కూడా వచ్చాడు.

డాక్టర్ గారు వాళ్ళని ఆశగా చూశాడు.. అతన్తో ఏదో మాట్లాడాలనుకున్నాడు.. కానీ అతను ఆయన్ని అలా విష్ చేసి వెంటనే వెళ్ళిపోయాడు. మనవడు కూడా వెళ్ళిపోయాడు!

డాక్టర్ గారు నీరసంగా కళ్లు మూసుకున్నాడు.

ఏంటి అందరూ నన్ను ఇలా ఒంటరిగా వదిలేసి ఎవరిదారిన వాళ్ళు వెళ్లిపోతున్నారు? నేను వీళ్ళ కోసం ఎంత కష్టపడ్డాను.. ఎంత సంపాదించి పెట్టాను?! కనీసం నాతో ఓ పావుగంటసేపు మాట్లాడటానికి కూడా వాళ్ళకు టైం ఉండటం లేదా?! నాకు అన్నీ వున్నాయి కానీ వొంటరి వాడిలా ఫీలవుతున్నాను.. ఎందుకు?! నా ఒంటరి తనానికి కారణం ఏంటి!? అవును నాకు నాలుగు ఆదరణ వాక్యాలు కావాలి.. ఓదార్పు కావాలి.. నీకేం పర్వాలేదు నాన్నగారూ మేమున్నాం అని పిల్లలు.. మీకేం పర్వాలేదండి నేను ఉన్నాను కదా అని వసంత నాలుగు మాటలు చెపితే చాలు.. ఎంతో ఉపశమనం కలుగుతుంది! ఉత్సాహం వస్తుంది!! మాటకంత బలం ఉందా ఇప్పుడర్థమయింది. నేనేనా ఇలా ఆలోచిస్తోంది? ఇన్నాళ్లు నేను చేసిందేమిటి?! నా నుంచి పేషెంట్లు కూడా ఇలానే ఎక్స్‌పెక్ట్ చేసుంటారు కదా?! నేను వాళ్ళ దగ్గర నుంచి డబ్బులు తీసుకొని కూడా వాళ్ళతో నవ్వుతూ మాట్లాడలేకపోయాను.. ఒక డాక్టర్ నుంచి పేషెంట్ అదే కదా కోరుకునేది? కేవలం మంచి మందులు ఇవ్వటమే కాదు.. నాలుగు మంచి మాటలు కూడా చెప్పాలి.. ఆ బాధేంటో నాకు ఇప్పుడు అర్థమవుతోంది! మాట్లాడితే టైం వేస్ట్ అని క్షణాల్ని కరెన్సీ నోట్లతో పోల్చి ఎంత దుర్మార్గంగా ప్రవర్తించాను?! నా చిన్నప్పుడు మా ఫ్యామిలీ డాక్టర్ గారు ఎంత ఆప్యా యంగా పలకరించేవాడు? అసలు ఆయన నవ్వు చూస్తేనే సగం జబ్బు నయమైపోయేది.. చక్కగా కుశల ప్రశ్నలు వేస్తూ ఇంటిల్లపాదినీ పేరుపేరున అడిగే వాడు.. అవును నాకు ఇంకా బాగా గుర్తు.. డాక్టర్ స్వామి గారంటే అందరూ దేవుడు అనేవాళ్లు! నాకు ఆయనకి ఎంత వ్యత్యాసం?! ఇద్దరం డాక్టర్లమే! ఆయన కంటే ఎక్కువ పేరునూ- డబ్బును సంపాదించాను- కానీ వృత్తిపరంగా నా కంటే ఆయనే ఎక్కువ న్యాయం చేకూర్చాడు. డాక్టర్ లక్ష్యం కేవలం డబ్బు సంపాదనే కాదు.. పేషెంట్లను మానవతా దృక్పథంతో చూడాలి.. వారిని నవ్వుతూ పలకరిస్తూ నాలుగు ఓదార్పు మాటలు పల్కాలి.. వాటి విలువ నాకు ఇప్పుడు అర్థమవుతోంది! ఎంత దుర్మార్గంగా ప్రవర్తించాను?! డబ్బు సంపాదనలో పడిపోయి కుటుంబ సభ్యుల అనురాగం - ఆప్యాయతల్ని కూడా కోల్పోయాను.." అని గాఢంగా నిట్టూర్చాడు డాక్టర్‌గారు.

"డాడీ నేను హాస్పిటల్‌కు వెళుతున్నాను... డాక్టర్ గారు మరో గంటలో వచ్చి మిమ్మల్ని చూస్తారు ఓకే!?" అన్నాడు డాక్టర్ గారి పెద్ద కుమారుడు డాక్టర్ సుధీర్.

"బాబు ఇలారా, ఇక్కడ కూర్చో కాసేపు.." అన్నాడు నీరసంగా డాక్టర్ గారు.

"వ్యాట్ డాడ్.. ఎందుకు నాకు టైంలేదు.. అర్జెంట్ ఆపరేషన్ వుంది?" అన్నాడు సీరియస్‌గా.

"అవును మీకు ఆపరేషన్లే ముఖ్యం, తండ్రి కాదు.." అన్నాడు నీరసంగా.

"అదేంటి డాడీ అలా అంటారు? మీకు మేమేం లోటు చేస్తున్నాం? ఫుల్‌టైం నర్స్ అటెండ్ అవుతోంది.. స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చి చెక్ చేస్తున్నారు.. మమ్మీ మీకు టైంకు అన్నీ అందేటట్లు చూస్తోంది.. ఇంకేంటి మీ బాధ?!" అన్నాడు ఆశ్చర్యంగా సుధీర్.

"నథింగ్.. ఓకే ఇట్సాల్ రైట్" అన్నాడు డాక్టర్ గోపాలకృష్ణా ఎమ్.ఎస్. నీరసంగా.

"అచ్చా బై డాడీ" అంటూ వెళ్లిపోయాడు.

అతనివైపే చూస్తూ వుండిపోయాడు డాక్టర్‌గారు.

"అవును సుధీర్ నా బాధ నీకు అర్థం కాదు.. ఎందుకంటే నువ్వు నా కొడుకువి కదా!? మరో గోపాలకృష్ణ రూపొందాడు.. నాకు వారసుడు.. నో..! అలా కావటానికి వీల్లేదు. వాడికి వైద్య వృత్తి ఔన్నత్యం గూర్చి చెప్పాలి. వృత్తిలో నాలాగానే నీకు మంచి పేరు వస్తా వుంది. కానీ వృత్తితో పాటు నీ ప్రవృత్తిలో కూడా కొంత మార్పు రావాలి.. ఒక చిన్న పలకరింపు రోగికి కొండంత బలాన్నిస్తుంది. ప్రతి రోగి డాక్టర్ని ఒక దేవుడిలా ఆరాధిస్తూ వుంటారు. అది గుర్తుంచుకుంటే చాలు.. నీలాగా వృద్ధిలోకి వస్తోన్న ప్రతి డాక్టరూ ఈ నిజాన్ని గుర్తించాలి.. అనుకుంటూ డాక్టర్ గారు మెల్లగా నిద్రలోకి జారుకున్నారు.

■